క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



తినుబండారాల అలంకరణలో పెద్దమ్మతల్లి

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం పంచాయతీ హౌసింగ్ బోర్డులోని పెదమ్మతల్లి ఆలయంలో ఆషాడ మాసం ఆదివారం, అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు చీర, సారె సమర్పించారు. అమ్మవారిని బాదుషా, లడ్లు, జాంగ్రి, పేలాల ముద్దలు తదితర తినుబండారాలతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి నక్షత్ర హారతి ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా భస్మహారతి



భస్మార్చనలో అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ఉజ్జయిని మహాకాళేశ్వరునికి చేసే విధంగా ఘనంగా భస్మహారతి ఇచ్చారు. వేకువజామున అగస్త్యేశ్వరునికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అగస్త్యేశ్వరుని మూలవిరాట్‌ను వేదపండితులు భస్మంతో అభిషేకించారు. అనంతరం హారతి ఇచ్చి భక్తిశ్రద్ధలతో పరమేశ్వరున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రావణ మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో సంజీవరాయ స్వామి

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో సోమవారం నుంచి శ్రావణ మాస పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ మాసంలో ముఖ్యంగా 10, 17, 24, 31 తేదీల్లో శనివారం రోజున శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకు పూజలు చేయనున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి, శ్రీచెన్నకేశవ సంజీవరాయ స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులు చేసి ఊరేగిస్తారు. ఆ రోజుల్లో స్వాముల వారిని దర్శించుకొని పూజలు చేస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. అలాగే ఈ మాసంలో రెండవ వారంలో 16వ తేదీన శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారాల్లో ఆలయాలకు వచ్చే భక్తులందరికి సంజీవరాయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు స్వాములను దర్శించుకొని పూజలు చేసి స్వామివారి కరుణా కటాక్షాలు పొందాలని అర్చకులు చెబుతున్నారు.

108 సిబ్బందికి సన్మానం



108 సిబ్బందిని సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మార్కెట్ యార్డులో 108 సిబ్బంది 13 మందికి రోటరీ క్లబ్, మిడ్‌టౌన్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా సత్కరించారు. 108 సిబ్బంది అందరికి స్నేహితులని 108 జిల్లా మేనేజర్ సురేంద్రకుమార్, మెడికల్ టెక్నీషియన్ రెడ్డెప్ప రెడ్డితో పాటు 108 పైలెట్, సిబ్బందిని సత్కరించినట్లు రోటరీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ సాధు గోపాలకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ మల్లిఖార్జున, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాల సూర్యారావు, సెక్రటరీ శ్రీధరశర్మ, మిడ్‌టౌన్ అధ్యక్షుడు తుకారం, సెక్రటరీ రాజు, ట్రస్ట్ ప్రెసిడెంట్ శివకుమార్, ప్రభు, జగదీష్, సూర్యనారాయణరెడ్డి, సరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. విద్యుత్‌తో జరభద్రం

- నిర్లక్ష్యం చేస్తే అంతే సంగతులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు



రాజుపాళెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

రాజుపాళెం : వానాకాలం వచ్చిందంటే చాలు విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తాయి. ఏమాత్రం ఆదమరిచినా దాని ఫలితం తీవ్రంగా ఉంటుంది. అందుకే ఈ సీజన్‌లో ప్రజలు, రైతులు, విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతం విద్యుత్‌తో కాల్వలు, కుందూనది, బోర్ల వద్ద మోటర్లు చేసి పంటలను సాగు చేస్తున్నారు. ఈ సమయంలో మోటర్ల వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదం బారిన పడకుండా ఉండొచ్చు. అలాగే అనుమతి లేని వ్యక్తులు ఫ్యూజులు వేయడం, వీధి దీపాలు మార్చడం చేయకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. విద్యుత్ తీగలు కిందికి వాలిన సమయంలో సిబ్బందికి సమాచారం అందించి వెంటనే సరిచేయించుకోవాలి. పంట పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు చిన్న చిన్న మరమ్మతులు చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోకపోతే విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉంది. ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులు చేయాల్సి వస్తే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలి.

చేయకూడని పనులు

- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకరాదు.
- నీటిలో పడిన విద్యుత్ వైర్ల జోలికి వెళ్లకూడదు.
- భవన నిర్మాణ పనులు చేసేటప్పుడు విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలి.
- తడి చేతులతో, తడి బట్టలతో విద్యుత్ పరికరాలు ముట్టుకోకూడదు, మరమ్మతులు చేయవద్దు.
- పిల్లలకు అందే ఎత్తులో స్విచ్ బోర్డులు ఉంచరాదు.
- స్తంభం, ట్రాన్స్ ఫార్మర్ దగ్గర మూత్ర విసర్జన చేయరాదు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటరుకు మధ్య ఎక్కువ దూరం ఉండకుండా చూసుకోవాలి.
- మోటర్ పనిచేయని సమయాల్లో చేతితో దానిని తాకకూడదు. టెస్టర్‌ను ఉపయోగించి మాత్రమే పరీక్షించాలి.
- విద్యుత్ స్తంభం నుంచి మోటరుకు కరెంటు నేరుగా సరఫరా కాకుండా మధ్యలో ఫ్యూజు వేయాలి. మోటరు వద్ద ఫ్యూజులు, ఇండికేటర్ బల్బులు, స్టార్టర్‌ను ఒక చెక్కపై బిగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇనుప డబ్బాపై బిగించకూడదు.
- విద్యుత్ సరఫరాలో లోపం ఉంటే మెకానిక్‌తో మరమ్మతులు చేయించుకోవాలి. పరిజ్ఞానం లేకుండా సొంతంగా మోటరును ముట్టుకోవద్దు.

జాగ్రత్తలు పాటించాలి



వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్ల స్విచ్‌లు ఆఫ్ చేయాలి. లేకుంటే వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే సొంతంగా మరమ్మతులు చేయకూడదు. సంబంధిత లైన్‌మెన్, సిబ్బందికి తెలియజేయాలి. ప్రతిఒక్కరూ విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలి.

– వేణుగోపాల్, విద్యుత్ ఏఈ, రాజుపాళెం మండలం

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న దివ్యజ్ఞానానంద స్వామీజీ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తొగటవీర క్షత్రియ కుల గురువు దివ్యజ్ఞానానంద స్వామి పేర్కొన్నారు. స్థానిక ఆచార్ల కాలనీలోని భాష్యం పాఠశాలలో ఆదివారం ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి పనుల వెనుక శక్తిస్వరూపిణి అమ్మవారి అనుగ్రహం ఉంటుందన్నారు. భగవంతున్ని చిత్తశుద్ధి, ఏకాగ్రతతో ప్రార్థించాలని కోరారు. భగవంతుని దర్శనం కోసం సంకల్పంతో ఉండాలని, రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలను చదివి అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్లా శేషయ్య, తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, పల్లాశంకర్, సిద్ధయ్య, సుబ్బయ్య, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ దేవి జయంత్యుత్సవం

- కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



అష్టభుజ మహాచౌడేశ్వరి



వసంతపేటలోని చౌడేశ్వరి



సుబ్బిరెడ్డి కొట్టాలలో చౌడేశ్వరిదేవి



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి



భక్తులకు దర్శమిచ్చిన చౌడేశ్వరిదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలను ఆదివారం పట్టణంలోని పలు ఆలయాల నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. స్థానిక సుబ్బిరెడ్డి కొట్టాలలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. వసంతపేటలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. ఆర్టీపీపీ రోడ్డులోని అష్టభుజ మహాచౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. స్థానిక వినాయకనగర్‌లోని చౌడేశ్వరిదేవి ఆలయంలో, ఆర్ట్స్ కళాశాలరోడ్డులోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌ను పూలతో సుందరంగా అలంకరించారు. అన్ని చౌడేశ్వరిదేవి ఆలయాలలో అమ్మవారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కొన్ని ఆలయాల నిర్వాహకులు సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. పాతమార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆషాడమాస అమావాస్య సందర్భంగా లలితాదేవి అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలతో పాటు 1008 నిమ్మకాయలతో అలంకరించారు.

చౌడేశ్వరిదేవికి చీర, సారె సమర్పణ

చౌడేశ్వరిదేవి జయంతి సందర్భంగా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవాంగ కులస్తులు ఊరేగింపుగా వెళ్లి చీర, సారె సమర్పించారు. స్థానిక దేవాంగ పేటలోని జ్యోతినగర్ నుంచి చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని మేదరవీధిలోని రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయం వరకు అమ్మవారి నామస్మరణ మధ్య వైభవంగా ఊరేగించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం, ఆలయ అధ్యక్షుడు వుట్టి నాగశయనం, గౌరవాధ్యక్షుడు వుట్టి లక్ష్మీనారాయణ, మచ్చా వెంకట సుబ్బరాయుడు, కార్యదర్శులు గిద్దలూరు ఈశ్వరయ్య, గిద్దలూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి జన్మదిన వేడుకలు

రాజుపాళెం : మండల పరిధిలోని పర్లపాడు గ్రామంలో ఆదివారం వైభవంగా చౌడేశ్వరి జన్మదిన వేడుకలను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారిని ప్రత్యేకంగా శోభాయమానంగా అర్చకుడు రవి అలంకరించారు. అనంతరం పర్లపాడు, పాటిమీద పల్లె, ఉలవపల్లె కొత్తపల్లె గ్రామాల్లోని మహిళలు, ప్రజలు, యువకులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి చీరెలను వేలం వేయగా పలువురు భక్తులు వాటిని దక్కించుకున్నారు. అక్కడకు వచ్చిన వారందరికి ఆలయ నిర్వాహకులు ప్రసాదాన్ని పంచిపెట్టారు.

ప్రత్యేక పూజలు

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామంలో ఆదివారం చౌడేశ్వరిదేవి జయంతిని ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరిదేవి ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. గ్రామస్తులు చౌడేశ్వరిదేవి ఆలయానికి వెళ్లి కాయకర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తొగటక్షత్రియులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో భక్తులు



చీర, సారె, కలశాలను ఊరేగిస్తున్న దేవాంగులు

రాయితీపై బిందు సేద్యం పరికరాలు



తుంపర సేద్యంలో పరికరాలు

పోరుమామిళ్ల : బిందు సేద్యం పరికరాలను రాయితీపై అందిస్తామని మండల ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రైతులు సోమవారం నుంచి సంబంధిత రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం ఆయన మాట్లాడుతూ బిందు సేద్యానికి 5 ఎకరాల లోపున్న సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం రాయితీతో గరిష్ఠంగా రూ. 2.18 లక్షల వరకు పరికరాలు అమర్చుకోవచ్చని తెలిపారు. 5 ఎకరాల పైబడి పొలమున్న రైతులకు 70 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు. తుంపర్ల సేద్య పరికరాలకు 45 నుంచి 55 శాతం రాయితీతో పరికరాలు లభిస్తాయని వివరించారు. బిందు సేద్యం వలన తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేయవచ్చని, సాగు నీరు వినియోగం, సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని, కరెంట్ ఆదా అవుతుందని ఆయన తెలిపారు. మొక్కకి కావాల్సిన నీరు, గాలి, పోషకాలు సమపాళ్లలో అందటం వలన మొక్క ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడి ఇస్తుందని చెప్పారు. బిందువుల రూపంలో నీరు అందించుట వలన భూమిలో తేమ శాతం సమపాళ్లలో ఉండి చీడపీడల దాడి అదుపులో ఉంటుందని తెలిపారు. రైతులు బిందు, తుంపర సేద్య పరికరాలతో సాగు చేయాలని శ్రీనివాసుల రెడ్డి సూచించారు.

కాషాయ జెండాలు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయకుమార్ సర్కిల్ వద్ద ఆదివారం 300 ఆటోలకు జైశ్రీరాం కాషాయ జెండాలను అందించారు. ఈ సందర్భంగా శ్రీరామ భక్త బృందం వ్యవస్థాపకుడు దశమందం బాబు మాట్లాడుతూ 300 ఆటోలకు వీఎల్ సురేంద్రనాథ్‌రెడ్డి, వాసవి ఆప్టికల్స్, దశమందం విద్యాసేవా సదన్ ఆధ్వర్యంలో 300 జెండాలను కట్టామన్నారు. ఇప్పటి వరకు 13,230 బైక్‌లకు, 800 పైగా ఆటోలకు కాషాయజెండాలను కట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గో సంరక్షణ సేవకులు, శివశక్తి, బీజేపీ నాయకులు, శ్రీరాంహనుమాన్ సేవకులు, దశమందం బ్రదర్స్ పాల్గొన్నారు.

శ్రీశైలం డ్యాం ఫ్లంజ్ పూల్‌ను వెంటనే పూడ్చండి

ప్రొద్దుటూరు : శ్రీశైలం డ్యాం కింద ఏర్పడిన ఫ్లంజ్ పూల్‌ను వెంటనే పూడ్చాలని, లేకుంటే డ్యాం కూలిపోయే ప్రమాదం ఉందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2009లో భారీ వరదల కారణంగా 45 మీటర్ల లోతులో, 400 మీటర్ల పొడవు, 270 మీటర్ల వెడల్పుతో భారీ గొయ్యి ఏర్పడిందని, దీని వల్ల ప్రమాదం పొంచి ఉందని ఆయన పేర్కొన్నారు. శ్రీశైలం డ్యాం ఫ్లంజ్ పూల్‌ను పూడ్చి శ్రీశైలం నీళ్లను నమ్ముకున్న రాయలసీమ రైతాంగాన్ని కాపాడాలని కోరారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



లక్ష్మిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

కాశినాయన : విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని ఎంఈఓలు నిర్మల, రఘురామిరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఆదివారం బాలాయపల్లె ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన లక్ష్మిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మిరెడ్డి పనిచేసిన ప్రతి గ్రామంలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నారని కొనియాడారు. ఆయన సేవలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు, మండల నాయకులు, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరెంటు స్తంభాన్ని మార్చండి సారూ..



గుంతచీపాడులోని వడ్డెర కాలనీలో ఇంటి గోడపై పడిన విద్యుత్ స్తంభం

చాపాడు : మీకు కనిపిస్తున్న ఈ ఫొటో అధికారుల నిరక్ష్యానికి అద్దం పడుతోంది. చాపాడు మండలం గుంతచీపాడుకు చెందిన వెంకటమ్మ నూతనంగా ఇల్లు నిర్మించుకుంటోంది. ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగి గోడపై పడింది. రెండు వారాల క్రితం విద్యుత్ స్తంభం పడిపోవటంతో విద్యుత్ అధికారులకు బాధితురాలు సమాచారం ఇచ్చింది. అయినా అధికారుల స్పందన కరువైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన స్తంభం ఏర్పాటు చేయాలని బాధిత కుటుంబం కోరుకుంటోంది. ఇటీవల గోడలకు నీరు పడుతుండగా తన కుమారుడు వెంకటరమణ విద్యుత్ షాక్‌కు గురయ్యాడని వెంకటమ్మ వాపోయింది

పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపండి

బద్వేలు అర్బన్ : పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు పి.చాంద్‌బాషా కోరారు. ఆదివారం స్థానిక ఆవాజ్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్ సైన్యం అంతర్జాతీయ యుద్ధ న్యాయ సూత్రాలను, చట్టాలను ఉల్లంఘించి పాలస్తీనా ప్రజలపై దాడులు చేస్తున్నా.. ప్రపంచ దేశాలు ప్రేక్షకపాత్ర వహించడం సరికాదని తప్పుబట్టారు. ప్రపంచంలో ఉండే మానవతావాదులు, ప్రజాతంత్రవాదులు పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలవాలని కోరారు. ఆవాజ్ జిల్లా కార్యవర్గ సభ్యులు అబ్దుల్ సత్తార్, షరీఫ్, ఖాదర్‌బాష, మస్తాన్, ఆవాజ్ నాయకులు జహంగీర్‌బాష, రసూల్ పాల్గొన్నారు.

బీసీ భవన్ ఏర్పాటుకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ భవన సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి రమేష్‌యాదవ్

బద్వేలు అర్బన్ : నియోజకవర్గ స్థాయిలో బద్వేలు పట్టణంలో బీసీ భవన్ ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని పూలే-మండల్ బీసీ భవన సాధన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, రమేష్‌యాదవ్ కోరారు. ఆదివారం స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ కులాలు ఏవైనా సమావేశాలు, సభలు ఏర్పాటు చేసుకునేందుకు నియోజకవర్గ స్థాయిలో బీసీ భవన్ లేకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి జిల్లా కేంద్రంలో నియోజకవర్గ కేంద్రంలో బీసీ భవన్ నిర్మిస్తామని చెప్పిన మేరకు బద్వేలు నియోజకవర్గంలో అనువైన స్థలం కేటాయించి బీసీ భవన్ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పూలే ఆశయసాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి, బీసీ భవన సాధన కమిటీ నాయకులు సింగరయ్య, ఉంటానరసింహులు, మిత్తికాయలరమణ, సుబ్బరాయుడు, బాలచెన్నయ్య, బ్రహ్మయ్య, సంటియ్య, కొలవలివేణుగోపాల్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు క్రైం : డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. కడప జిల్లా టీఎన్ఎస్ఎఫ్ ముద్రించిన 'ఓ విద్యార్థి, యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడదాం' అనే పోస్టర్‌ను కామనూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడంలో విద్యార్థి, యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేషు, ఉపాధ్యక్షుడు చేతన్ కుమార్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌చార్జి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.